# నగరంలో నరకాసురుడు




జి.వి.జి

"నీ వయసెంత ?''

అతని దృష్టి నా చేతిలోని పిస్టల్ మీదుంది. కంపించే కంఠంతో ''చూడు మిస్టర్! కేష్ రిజిస్టర్‌లో అట్టేలేదు. కాని, గల్లాపెట్టెలో ఎంత ఉంటే అంతా తీసేసుకో. నే నేం కిక్కురుమనను,'' అని గొణిగాడు.

"నీ పాపిష్టి డబ్బు ఎవడికి కావాలోయ్! నీ వయసెంత?"

"నలభై రెండు."

అతను గుడ్లు తేలవేశాడు.

"ఊఁ...చెప్పు!" నేను గుడ్లురిమాను.

"పాపం! నువ్వంత కఠినంగా ప్రవర్తించకుండా ఉంటే-మరో పాతికేళ్ళయినా జీవించి ఉండేవాడివి కదా?"

''నీకేమైనా మతిపోయిందా? అంత మాత్రంచేత నన్ను చంపగలవా ?"

"గలను," అన్నాను.

అంతే. అన్నంత పనీ చేసేశాను.

* * *

నేను మరో నాలుగు మాసాలకన్నా ఎక్కువ బతకనని డాక్టర్ శివరాం గారు స్పష్టంగా చెప్పినప్పుడు నేనిక క్రుంగిపోయిమాత్రం ప్రయోజనమేమిటి? "ఒకవేళ ఎక్సరేలు ఏవైనా తారుమారయ్యాయేమో, డాక్టరుగారూ! అటువంటి పొరపాట్లు జరగడంలో వింతేమీ లేదుకదా ?"

"నోనో... అటువంటి దేమీలేదు. లేబరేటరీ రిపోర్ట్లుకూడా పరిశీలించానుగా?''

బరువుగా నిట్టూర్చాను.

"ఇటువంటి కేసులలో ఏ డాక్టరైనా మహా అవస్థలో పడిపోతాడు. రోగికి యథార్థం చెప్పడమా - లేక మానడమా అని సంకోచించడం సహజమే. కాని, నే నలాకాదు. ఏమాత్రం కప్పిపుచ్చను. అందువల్ల రోగి మొదట్నించే ఎలాగో గుండె దిటవుచేసుకొని, తన అంత్యకాలం సమీపించేలోగా తన ఆశయాలేవైనా ఉంటే-వాటిని పూర్తి చేసుకోడానికి వీలవుతుంది, ఈ విషయంమీద నేనో గ్రంథంరాస్తున్నాను." అంటూ శివరాంగారు మేజాసొరుగులోంచి ఒక పుస్తకాన్ని బయటకు తీసి "నీ శేష జీవితాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోదలచావ్ ?" అని ప్రశ్నించారు."

"ఇప్పుడప్పుడే నేనేం చెప్పనూ ? చావు కబురును చల్లగా మీ రిప్పుడే చెప్పారాయె."

"అవునవును. నీ బసకు వెళ్ళాక నింపాదిగా ఆలోచించుకో. నువ్వేదైనా నిర్ణయానికి వస్తే మాత్రం వచ్చి నాకు తప్పకుండా తెలియజేయి. ఈ గ్రంథరచనలో నా కెంతైనా సహకరించిన వాడివవుతావు.'' అంటూ శివరాంగారు ఆ పుస్తకాన్ని మళ్ళీ మేజాసొరుగులో పడేస్తూ. ''వారానికి ఒకటి రెండుసార్లయినా వచ్చి నన్ను చూస్తూండు," అన్నారు.

''నా క్షీణదశ ఎంతటి ప్రోగ్రెస్‌లో ఉందో మీకు తెలియాలికదా? అలాగే!" అంటూ లేని నవ్వుతెచ్చుకొని లేచాను.

"హుషారుగా ఉండు. ఏనాటికైనా మనమంతా అక్కడికి చేరుకోవలసిన వాళ్ళమే. కాకపోతే ఒకరు ముందు, మరొకరు వెనుకా-అంతే... ఇదుగో నీ కేసు ఫైలును తీసుకెళ్ళిపో. ఇక్కడ దీని అవసరం లేదిక.''

నేను గాలికి పుట్టి, ధూళికి పెరిగాను. నా ఉనికివల్ల ఈ ప్రపంచానికి ఇంతవరకు ఏ ప్రయోజనమూ జరగ

లేదు. చాలామందిలాగే నేనూ తోటి మానవాళికి ఏ మేలూ చేయలేదు; కీడు అంతకన్నా చేయలేదు. నా కాళ్ళమీద నేను నిలుచొని, నా పొట్టను నేను పోషించుకుంటున్నాను. ఇంతవరకు ఏకాకి జీవితమే హాయి అనిపించింది. కాని ఇప్పుడు మాత్రం అదికూడా ఒక బతుకేనా అనిపిస్తోంది.

భారంగా గడిచే మరో నాలుగు నెలల్లో ఎవరైనా ఏం చేయగలరు ?

ఆలోచనలతో నా మెదడు మొద్దుబారిపోయేసరికి నేను వంతెనమీద ఉన్నాను. అప్పటికి చీకటి పడుతోంది. చేతనున్న కేసుఫైల్ వంక ఒకసారి జాలిగా చూసి, దాన్ని కాలువలోకి విసిరేశాను. కాళ్ళీడ్చుకొని మళ్ళీ నడక సాగిస్తూ అప్రయత్నంగా పాంట్ జేబులోకి చేతిని పోనిచ్చాను. అప్పుడే క్లీన్ చేయించి, తూటాలతో నింపి తెచ్చిన పిస్టల్ నా చేతికి తగిలింది. మరొకరైతే మరో నాలుగు మాసాలు ఈడ్చిస్తూ గడపడం దేనికని ఆత్మహత్య చేసుకునేవారే. కాని, నేనంతటి పిరికివాణ్ని కాను ఎప్పుడో పిట్టలు కొట్టడానికి కొన్న పిస్టల్‌తో నా నిండు ప్రాణాలు తీసుకోనా? నా ప్రాణం దానంతటదే పోవలసిందే. ఇంకో నాలుగు మాసాలలో అది తప్పదని డాక్టర్‌గారు చెప్పనే చెప్పారు.

బలవంతంగా ఈ ఆలోచనలకు స్వస్తిచెప్పేసరికి నా చెవులకు ఏదో సంగీతం సోకింది. ఆగాను. అటువైపున మైదానంలో సర్కస్‌టెంట్ మీద రంగురంగుల దీపాలు తోరణాల్లా ఉన్నాయి. ఆ కళాకారుల వృత్తి కత్తిమీద సాముచేయడం లాంటిది. అది చూపరులకు వినోదం; నేనీ స్థితిలో కాస్సేపు నా చావు గురించి మరవడానికి ఆ దీపాలు ఆశాజ్యోతుల్లా కనిపించాయి—గబగబ వెళ్ళాను.

సర్కస్ అప్పటికే ప్రారంభమైనట్లుంది. బయట అట్టే జనసందడి లేదు. మూడు రూపాయల టిక్కెట్ కొన్నాను ఆ టిక్కెట్ ఇస్తూ 'అయ్యా దీని డూప్లికేట్ ముక్కను మీవద్ద భద్రంగా దాచుకోండి. ఇంకో రెండు రోజుల్లో మే మిక్కడ్నించి గుడారం ఎత్తేస్తాం. ఆఖరి రోజున లక్కీడిప్ జరుగుతుంది. అందులో ఈ నెంబర్ వస్తే, మీకేదైనా బహుమతి ఉంటుంది. అన్నాడా బుక్కింగ్ ఆఫీస్‌లోనిమనిషి.

నా బతుక్కి బహుమతి కూడానా- అని నాలో నేను నవ్వుకుంటూ, లోపలికెళ్ళే పెద్దగేటుదగ్గరికి చేరుకునేలోగా ఒక సంఘటన జరిగింది.

ఒక బట్టతలమనిషి రొప్పుతూ ఇద్దరు పిల్లలతో ఆ గేటుదగ్గరికి వచ్చి, ఒక అట్టముక్కను ఆ గేటువాడికిచ్చాడు. వాడా అట్టముక్కను పరిశీలించాక దాన్ని ముక్కలు ముక్కలు చేసి కిందపారవేశాడు.

''ఏమిటిది?'' ఆ బట్టతలమనిషి అయోమయంగా చూశాడు.

"ఈ నెంబరు పాసు చెల్లదయ్యా మీ కొట్టుముందు మా సర్కస్ పోస్టర్‌ను ఇటీవల తగిలించడంలేదని మాకు ఫిర్యాదు వచ్చింది."

"ఎప్పుడో ఒకరోజు తగిలించడం మరిచిపోయా ననుకో. అందుకని నాకిచ్చిన పాస్‌ను చించేస్తావా?"

లేకపోతే ఏంచేయమంటావేం ? నాలుక గీక్కోవడానికి కూడా ఇది పనికిరాదిక."

'లోపలికి పోదాం రా, తాతయ్యా. అప్పుడే సర్కస్ మొదలుపెట్టినట్లుంది." అంది ఓ అమ్మాయి,

"ఆ పాస్ ఉందికదా అని నేనాట్టే డబ్బులు తెచ్చుకోలేదమ్మా," అన్నాడా బట్టతల మనిషి దీనంగా చూస్తూ.

"నువ్వెప్పుడూ ఇంతే!" మరో అమ్మాయి ఏడ్పుముఖం పెట్టింది.

ఇప్పుడు కాకపోతే రేపు డబ్బులిచ్చి దర్జాగా చూద్దాం రా, అమ్మలూ!'' అంటూ ఆ బట్టతల మనిషి, ఆ పిల్లలను లాక్కొని వెళ్ళిపోయాడు.

అప్పుడా గేటు సమీపంగా నిర్మానుష్యంగానే ఉంది. మెల్లగా ఆ గేటువాడి దగ్గరికి చేరుకున్నాను. "నువ్విప్పుడు చేసిన పాడుపని ఏమిటి?" అంటూ, నేలమీదున్న పాస్ ముక్కలను చూపించాను.

''నీ కెందుకూ ?''

''మర్యాదగా మాట్లాడ్డం తెలీదా?''

"నేనేం తప్పుచేశానని. కొన్ని షాపులముందు మా పబ్లిసిటీ పోస్టర్లను ఉంచుతూంటాం. మా సర్కస్ ఈ ఊళ్ళో ఉన్నంతకాలం ఆ పోస్టర్లను ప్రతిరోజూ షాపులముందు తగిలించే బాధ్యత ఆ షాపులవారిది. అందుకోసమని వాళ్ళకు ఫ్రీ పాసులు ఇస్తాం కదా? కాని, ప్రతిరోజూ అలా షాపులముందు పోస్టర్లు ఉంచారో లేదో ఊరంతా తిరిగి తనిఖీచేసిరావడానికి మా ట్రూప్‌లో ఒకమనిషి ఉంటాడన్న విషయం ఆ బద్ధకస్తునికి తెలియదు కామోసు. తేరగా సర్కస్‌ను చూడ్డానికి మాత్రం వచ్చాడు పిల్లలతో సహా."

"అందుకని ఆ పిల్లలముందు ఆ పెద్దమనిషిని అంతగా అవమానిస్తావా. పాపం-ఆ పిల్లలు ఎంత ఆశతో వచ్చారు! అతనెంత ముచ్చటపడి వాళ్ళను తీసుకొచ్చాడు.''

''అయితే?''

"నువ్వంత కఠినంగా ప్రవర్తించడం న్యాయమా? ఆ పాసు చెల్లదని చెప్పేస్తే పోలా? దాన్ని చించి పారేసి వాళ్ళ ముఖాలు చిన్నబోయేలా చేస్తావా?''

"మీరేమైనా ఆఫీసరా?"

"నేనేమైతే ఏం. నీది మాత్రం పాషాణ హృదయం."

"నా తప్పేముందండీ?" అతను పిసినిగొట్టులా ఉన్నాడు. "ఏమైనా పాపు యజమానికదా? అంతగా పిల్లలకు సర్కస్ చూపించాలని ఉంటే జేబులో నాలుగు డబ్బులు ఎక్కువగా వేసుకొని రాకూడదూ? అయినా, నేను మీకెందుకు సంజాయిషీ చెప్పుకోవాలి!"

"ఒహో! అలాగా?" అంటూ చురచుర చూశాను. ఇటువంటి కఠినాత్ముడు భూమికి భారం. ఇలాంటివారిని తొలగిస్తేగాని, తోటి మానవులు సుఖపడలేరు. ఆ పుణ్యం నేనెందుకు కట్టుకోకూడదు? నిజమే.. నా మిగతా మనుగడను సార్థకం చేసుకోవాలి.

ఇంతలో సర్కస్ డేరా చుట్టూ ప్రకాశవంతంగా వెలిగే కొన్ని పెద్ద పెద్ద బల్బులు ఆరిపోయాయి. లోపల ఆర్కెస్ట్రా తారస్థాయిలో వినిపిస్తోంది. రింగ్‌లో మోటార్ సైకిళ్ళతో ఫీట్సు చేస్తున్నట్లుంది-ఆ రణగొణ ధ్వనులువేరే. అటువైపున సింహాలు గర్జిస్తున్నాయి.

ఆ గేటువాడు ఇక ప్రేక్షకులెవరూ రారనుకున్నాడేమో-గేటును ఓరగా మూయబోతూ, "మీరిక్కడే ఉన్నారేం?" అన్నాడు.

"నిన్ను పంపించేసి వెళ్ళిపోతా," అంటూ పాంట్ జేబులోకి చేతిని పోనిచ్చి, "నీ వయసెంత?" అన్నాను.

"ఎందుకో!" అన్నాడతను నిర్లక్ష్యంగా భుజాలు ఎగరేస్తూ.

"చెప్పు!" అంటూ చివాలున పిస్టల్‌ను బయటకు తీశాను.

"ముప్ఫైరెండు..." అన్నాడతను వొణికే గొంతుతో.

"దృఢకాయుడివి. ఆరోగ్యవంతుడివి. మరో నలభై ఏళ్ళయినా ఉండేవాడివేమో-ఇందాక అలా అమానుషంగా ప్రవర్తించకుండా ఉంటే."



అతను బిత్తరపోయిచూస్తూ, పెద్దగా అరవడానికి నోరు తెరిచాడు. అంతే. అలా నోరుతెరుచుకునే నేలకు ఒరిగాడు. ఆ పిస్టల్ ప్రేలుడు హెచ్చు స్థాయిలో వినిపిస్తున్న మోటారు సైకిళ్ళు, ఆర్కెస్ట్రా హోరులో కలిసిపోయి ఉంటుంది.

నేనిక అక్కడ మరో క్షణం ఉండకూడదు. కాని, వెళ్ళేముందు ఇతరమానవాళికి గుణపాఠంగా ఓపని చేయాలి. షర్ట్ జేబులోంచి నా డైరీని తీసి, అందులోంచి ఒక కాగితం చింపాను. "కఠినాత్ములు తోటి మానవుల మధ్య ఉండరాదు. నిర్దయగా ప్రవర్తించే వారికి ఇదొక హెచ్చరిక?" అని రాసి ఆ కాగితాన్ని చుట్టగా చుట్టి, అతని తెరిచిన నోటిలో ఉంచి, అక్కడ్నించి వడివడి అడుగులతో బయలుదేరాను.

వంతెన దగ్గర ఒక ఖాళీ ఆటోరిక్షా కనిపిస్తే, అందులోకి దూకి "డీలక్స్ హోటల్‌కు పోనియ్," అన్నాను.

కడుపారా మెక్కిన తర్వాత నా గదికి చేరుకున్నాను. పైకప్పుకేసి చూస్తూ పడుకొని "నే చేసింది మంచి పనా—కాదా?" అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

"ఒకడ్ని చంపాను. ఐతే ఏం - ఒక రాతిగుండెవల్ల బాధలు కలగకుండా ఎంతోమందికి మేలు చేశాను.

ఆ సమాధానంతో తృప్తిగా కళ్ళు మూసుకున్నాను.

మర్నాటి ఉదయం పాంట్ జేబులో

పిస్టల్, డైరీఉంచుకొని, ఈ సంఘంలో ఉండకూడని వ్యక్తులకోసం గాలిస్తూ బయలుదేరాను.

ఆ సాయంకాలంవరకు ఎవ్వరూ తారసపడలేదు. ఇక గదికి బయలు దేరుదామని బస్సు ఎక్కాను. బస్సు కదిలింది. టిక్కెట్ కొన్నాను.

ఒక స్టాపింగ్‌లో ఒక నడివయస్సు రాలు ఆదరాబాదరాగా వచ్చి కదులుతున్న ఆ బస్సు ఎక్కింది.

కండక్టరు రుసరుసలాడ్తూ, "ఏమ్మా, ఏమంత కొంప మునిగి పోతుందని ? తర్వాతి బస్సులో రాకూడదూ ?" అన్నాడు.

"సారీ," అందామె.

"బయట ఏం రాసిఉందో చూడ్డానికి మీకు కళ్ళు లేవా ? ఈ వెనుక వైపునించి కదా బస్సు ఎక్కాలి ?"

"పొరబాటయింది."

"ఇది మరో పొరబాటు. లేడీస్‌కు ఇక్కడ ప్రత్యేకంగా సీట్లు ఉండగా–అక్కడ కూర్చుంటావేమిటి ? ఇలావచ్చి కూర్చో!" అన్నాడు కండక్టర్ ఏక వచనంలో సంబోధనకు మారుతూ.

"ఓ...సారీ !" అంటూ ఆమె లేచి వచ్చి, లేడీస్ సీట్లో కూర్చొని, పర్సులోంచి ఐదురూపాయలనోటు తీసింది.

"అమ్మా ! చిల్లర లేకుండా బస్సు ఎక్కుతావెందుకు?" అంటూ కండక్టరు చెవులు గింగురుమనేలా విజిల్ ఊదాడు. బస్సు ఆగింది. "ఇంకా అలా గుడ్లు మిటకరించి చూస్తావేం ? ఊఁ దిగు !''

ఆమె మెట్లు దిగేలోగానే అతను విజిల్ ఊదడంతో బస్సు కదిలింది. దాంతో, చివరి మెట్టుమీదనించి ఆమె కాలు జారి, రోడ్డుమీద పడింది.

"అరెరే...అయ్యో, పాపం !" అన్నారు బస్సులోని వారెవరో.

"ఏమిటా పాపం ? ఇటువంటి వాళ్ళకు అయ్యో పాపమంటే ఆర్నెల్ల పాపం," అన్నాడా కండక్టర్ ఒక ఖాళీసీట్లో కూలబడుతూ.

అతనివంకే గుడ్లప్పగించిచూస్తుండిపోయాను.

టెర్మినస్ దగ్గర ఆ కండక్టర్ బస్సు దిగగానే బీడీ వెలిగించి, లఘుశంక తీర్చుకోడానికి కాబోలు కొంతదూరం నడిచి, ఒకచెట్టుచాటుకు చేరుకున్నాడు. అతన్ని అనుసరించి వెళ్ళాను. ఇటు అటు చూశాను. అక్కడంతా నిర్మానుష్యంగా ఉంది. దూరంగా ఎక్కడో వీధిదీపం ఏడుస్తున్నట్లు వెలుగుతోంది.

ఆ కండక్టర్ లేచి, వెనుతిరిగాడు.

"నీ వయసెంత ?"

తృళ్ళిపడ్డాడు. "ఎవరు నువ్వు ? ఏమిటా ప్రశ్న ?"

''జవాబు చెప్పు!''అంటూ పిస్టల్‌ను బయటకు తీశాను.

"ఇరవై తొమ్మిది."ఎక్కడో బావిలోంచి వినిపిస్తున్నట్లుంది అతని కంఠస్వరం...''కర్కోటకుడా ! ఒక ఆడదానిపట్ల సభ్యతగా ప్రవర్తించలేని నీలాంటి కర్కశహృదయు లెందుకు ఇంకా ఈ భూమ్మీద ఉండాలి ?''

పిస్టల్ పేలింది. అతను భూమికి ఒరిగాడు. నేను డైరీలో ముందే రాసుకువచ్చిన కాగితాన్ని చింపి, అతని కాఖీపాంట్ జేబులో ఉంచాను. అందులో ''తోటి మానవాళిని పురుగుల్లా చూసే వ్యక్తులు ఎంత త్వరగా చస్తే అంత మంచిది. అలా పరుషంగా మాట్లాడేవారికి, కటువుగా ప్రవర్తించే వారికి ఇది మరో హెచ్చరిక !'' అని రాశాను

అంతే. అక్కడ్నించి కాలికొద్దీ పరుగుతీశాను. నేను పట్టుబడిపోతే జైలుపాలవుతానని భయపడికాదు. నేను పట్టుబడితే– నే చచ్చేలోగా ఇటువంటి దుర్మార్గుల బారినుంచి తోటి మానవాళిని కాపాడేందుకు వీలుపడదు కదా అన్న చింత మాత్రమే.

మర్నాటి ఉదయం గొంతులోపోటు ఎక్కువైంది. నుదుటివద్ద నరాలు బిగదీసుకు పోయినట్లయింది. మెదడులో ఏదో జోరీగ దూరినట్లుంది. ఏ బాధా లేకుండా హాయిగా గుటుక్కుమనే యోగాన్ని భగవంతుడు కలిగించలేదు, నాకు. ఒకటే దాహం. ఉదయంనించి గొంతులో పచ్చిమంచినీళ్ళయినా పోసుకొని ఎరుగను. సాయంత్రం కూల్ డ్రింక్ ఏదైనా తాగాలనిపించింది. అతి ప్రయాసతో బయలుదేరాను.

వీధి మొగదలలో పాడుపడ్డ సత్రం పక్కన ఒక చిన్న స్టోర్ కనిపించింది. అందులోకి వెళ్ళాను. ఆ కొట్టు యజమాని చేతిలో పేపరుంది. అతని ఎదురుగా లిమ్కా త్రాగుతూన్న ఒకతను "వీడెవడో నరకాసురుడిలా ఉన్నాడు. వీడు ప్రతి హత్యజరిగిన స్థలంలో డైరీలోంచి కాగితాన్ని చించి, దానిమీద రాసి పడేస్తున్నాడు. ఆ కాగితాలమీద వాడి వేలిముద్రలు ఉంటాయిగా ? అయినా, పోలీసులు ఏంచేస్తున్నట్లు?." అని ప్రశ్నించాడు.

"వేలిముద్రలుంటె మాత్రం–వాళ్ళ ఫైల్స్‌లో అతని వేలిముద్రలు ఉండాలిగా ? దస్తూరీ పోల్చుకునే విషయంలోనూ అంతే. ఒకటి మాత్రం ప్రతి హత్యా సందర్భంలోనూ సామాన్యంగా కనిపిస్తోంది. కటువుగా ప్రవర్తించేవారిపట్లే అతనూ ప్రవర్తిస్తున్నాడు. అందుకని ఈవేళ ఉదయంనించి నా కొట్టుకు మీలాంటి వారెవరొచ్చినా ఎంతో వినయ విధేయతలతో ప్రవర్తిస్తున్నాను. ఇందువల్ల నాకు పోయిందేమీలేదు,'' అన్నాడా కొట్టతను.

లిమ్కా తాగిన మనిషి వెళ్ళిపోయాక కొట్టతను నా వంక విన

క్రమంగా చూశాడు. "తమకేంకావాలి, సార్?..."అన్నాడు చేతులు కట్టుకొని.

ఏం మర్యాద! వీడు నా లిస్టులోకి ఎక్కే శాల్తీలా లేడు. ఊళ్ళో ఉన్న వాళ్ళందరూ ఇంత మట్టూమర్యాదతో ప్రవర్తిస్తే ఎంత బాగుణ్ణు!

"తమ కేంకావాలో చెప్పారు కాదు..." మళ్ళీ అడిగాడు.

"కోకోకోలా," అన్నాను.


"ఒరేయ్, అయ్యగారికి కోకోకోలా! ఒరేయ్, ఎక్కడ చచ్చావురా?" అంటూ ఆ కొట్టతను ఇటు అటు చూశాడు. ఓ మూల స్టూల్ మీద కూర్చొని కునికిపాట్లు పడుతున్న ఓ కుర్రాడి దగ్గరికి మెల్లిగా వెళ్ళి, బాగా చాచి, ఒక్క లెంపకాయ వేశాడు. ఆ కుర్రాడు పాపం, తృళ్ళిపడి లేచి నిలుచున్నాడు. వాడి చెవులు మెలేస్తూ "వెధవా! కొట్లో నిద్రపోకూడదని ఎన్నిసార్లు చెప్పాను? ఇక్కడ ఇంకో క్షణం ఉండకు, వెళ్ళిపో..."అన్నాడు.

ఆ కుర్రాడు కందిపోయిన తన చెంపను తడువుకుంటూ, "సార్! ఇక నిద్రపోను, సార్!" అన్నాడు.

"నువ్వు నాకు అక్కర్లేదు, అంతే. రేపొచ్చి నీ జీతం పట్టుకుపో. ఊఁ... వెళ్ళు!"

"సార్! మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను కొట్టండి. తిట్టండి. పనిలోంచి మాత్రం తీసెయ్యకండి. మా అమ్మ జబ్బుతో మంచంమీదుంది. నా అక్కకు నేనే పెళ్ళిచెయ్యాలి. మా ఇంట్లో నేనే మగదిక్కు," అంటూ దాదాపు బావురుమన్నాడు.

"వెళ్ళమంటూంటే!" అంటూ ఆ కొట్టతను ఆ కుర్రాడిని బరబర లాక్కెళ్ళి బయటకు తోసేశాడు. "లోపలికొచ్చావా నీ తోలు వొలిచేస్తాను," అంటూ నా దగ్గరికి వచ్చి,




"క్షమించాలి, సార్! ఏమిటి అడిగారు మీరు? కోకోకోలా కదూ?"అన్నాడు.

ఆ కుర్రాడు వెక్కివెక్కి ఏడుస్తూ, వెళ్ళిపోయాడు. ఆ కొట్టులో మరెవరూ లేరు.

కొట్టతనివంక చురచుర చూశాను. "నువ్విప్పుడు చేసిన పనేమిటి? పాపం! ఆ అబ్బాయికి ఎనిమిదేళ్ళకన్నా ఎక్కువ ఉండవు. ఇప్పుడు తొమ్మిదవబోతోందా? పెద్దవారికే నిద్రవచ్చే సమయం. బాగా అలసిపోయాడేమో-వాడికి తెలీకుండానే కళ్ళు మూతలు పడిఉంటాయి. అంతమాత్రంచేత అంత క్రూరంగా ప్రవర్తిస్తావా? పైగా వాడిమీద—జబ్బుతో ఉన్న తల్లి, పెళ్ళి కావలసిన అక్కయ్య ఆధారపడి ఉన్నారు. వాడ్ని పనిలోంచి తీసేస్తే-వాళ్ళ గతేంకావాలి?"

"సారీ! మీరలా కూర్చోండి. మీకు కోకోకోలా తెస్తాను."

"ఆగు!"

అతను ఆగాడు.

"నీ వయసెంత?"

అతని దృష్టి నా చేతిలోని పిస్టల్ మీద పడింది.

ఆ తర్వాత అంతా మామూలే. అతని జేబులో ఉంచిన డైరీ కాగితంలో క్రూరంగా ప్రవర్తించేవారికి ఇతని మృత్యువు ఒక గుణపాఠం కాగలదు" అని రాసి, ఫ్రిజ్‌డైర్‌లోంచి ఒక కోకోకోలాను నేనే తీసుకొని త్రాగి, అక్కడ్నుంచి కదిలాను.

మర్నాటి ఉదయం. నా చావుకు మరోరోజు దగ్గరపడింది. గొంతులో కండరాలు బిగదీసుకుపోయినట్లుంది. అప్పుడప్పుడు శ్వాసపీల్చడం కష్టంగా ఉంటోంది.

పేపర్ తిరగేశాను. మొదటిపేజీలో "నగరంలో నరకాసురుడు" అనే పెద్ద హెడ్డింగ్ కింద ఇటీవల సంచలనం కలిగించిన విచిత్రమైన హత్యలగురించి వివరాలున్నాయి. ఆ వివరాలు నాకు తెలుసు కనుక చదవడం అనవసరమనిపించింది. ఆ వార్తకింద సర్కస్‌వారి ప్రకటన ఉంది. 'లక్కీడిప్'లో గెలుపొందిన నెంబర్లు ప్రకటించారు. ఆనాడు నే కొన్న సర్కస్ టిక్కెట్ జ్ఞాపకం వచ్చింది. డైరీలో దాచిఉంచిన ఆ టిక్కెట్‌ను మడత విప్పిచూశాను.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. నే కొన్న టిక్కెట్‌కు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది! సైకిల్ అట! ఎంత ఆశ్చర్యం! రేపో మాపో చావబోయే నాకు ఫస్టుప్రైజా! టాక్సీలోనో, బస్సులలోనో వెళ్ళకుండా ఆ సైకిల్‌మీదే నేను సిటీ అంతాచుట్టి, నేను చచ్చేలోగా

మరికొందరు కఠినాత్ములకు తగినశిక్ష విధించవచ్చు. సాయంత్రం ఆరుగంటలకు నేనాటికెట్‌ను ఆ సర్కస్ కంపెనీ వారికి అందజేస్తే, నాకా బహుమతిని ఇస్తారట!

అలాగే సాయంత్రం సర్కస్‌దగ్గరికి చేరుకున్నాను. పెద్ద గేటుదగ్గర చిన్నగుంపు ప్రోగయిఉంది.

"ఇంకాస్సేపట్లో గెలుపొందిన నెంబర్లను పిలుస్తాం. ఒక్కొక్కరుగా లోపలికివచ్చి, బహుమతులు పట్టుకెళ్ళొచ్చు," అని మైక్‌లో ప్రకటన వినిపించింది.

వెంటనే దబ్‌మని ఏదో శబ్దం వినిపించింది. వెనుతిరిగి చూశాను. కారులో ఉన్న ఒకతను తలుపును విసురుగా తోశాడు. అది పక్కనున్న ఒక కానిస్టేబుల్‌కు బలంగా తగిలింది అతను కాస్తా మొదలు నరికిన మ్రానులా స్పృహతప్పి నేలమీద పడిపోయాడు.

"అరే!" అంటూ చివాలున నేనక్కడికివెళ్ళి, "పక్కన ఎవరైనా ఉన్నారో-లేదో చూసికదా తలుపు తీయాలి?'" అన్నాను.

కారులోంచి ఆ మనిషి దిగుతూ, "చూసే తోశానయ్యా. వాడికి బుద్ధి చెప్పాలనే అలా తోశాను. నా కారును ఇక్కడ పార్క్ చేయడం తప్పే అనుకో. వాడు నా కారు నెంబరు నోట్‌చేసుకొని వెళ్ళిపోవాలా ? నా డ్రైవింగ్ లైసెన్స్ ఏదని అడిగాడు. ఇంట్లో మరిచిపోయివచ్చానన్నా. దానికి ఎంతేసిమాటలన్నాడో తెలుసా? చివరిక్కి ఈ కారు ఎవరిదోనని, నేను దొంగిలించుకు వచ్చానని తానెందుకు అనుమానించకూడదు - అంటాడా ఆ రాస్కెల్!" అంటూ మళ్లీ కారులో కూర్చోబోయాడు.

"ఆగు ! డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌ను అలాస్పృహతప్పి పడిపోయేలా పడేసి, నీ పాటికి నువ్వు కారులో జారుకోవాలని చూస్తావా? నీ వయసెంత?" అన్నాను పాంట్ జేబులోకి చేతిని పోనిచ్చి.

"నా వయసా ? త్వరలోనే నాకు నూరేళ్ళు నిండబోతున్నాయి.' అన్నాడు దగ్గుతూ.

'త్వరలోనే అంటే ?'

"రేపు కావొచ్చు, మాపు కావొచ్చు. మరో క్షణంలోనే కావొచ్చు" అని వికటంగా నవ్వుతున్న అతనికి మళ్లీ దగ్గు తెర వచ్చింది. ఆయాసంతో కుడి రొమ్మును చేత్తో అదిమిపట్టుకున్నాడు.

"నీకు పిచ్చా?" అంటూ పిస్టల్‌ను బయటకు తీశాను.

"పిచ్చే మరి. నాకు ఊపిరితిత్తిలో కాన్సర్. నేను ఎక్కువకాలం బతకనని డాక్టర్లు అన్నారు. అంతవరకు బాధలో బతకాలని లేదు నాకు. ఆత్మహత్య చేసుకుందామంటే—అది పిరికితనమనిపించింది. ఎవరి చేతుల్లోనైనా చావడమే మంచిది. నీ పిస్టల్‌ను పేల్చు!" అంటూ అతను మళ్ళీ దగ్గుతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నప్పుడు అతనిపట్ల నాకు ఎంతైనా జాలి కలిగింది. నా పిస్టల్‌ను పాంట్ జేబులోపెట్టి, మెల్లగా అతని దగ్గరగా వెళ్ళి, అతని భుజంతట్టి, "చావుకు భయపడకు. నేను కూడా నీలాగే కాన్సర్‌వ్యాధి పీడితుడ్ని. నాకు గొంతులో కేన్సర్, నా ఆయువు కూడా త్వరలో మూడబోతోంది." అన్నాను.

చివాలున అతను నా పాంట్ జేబులోకి చేతిని పోనిచ్చి. పిస్టల్‌ను లాక్కున్నాడు. "నీ కోసమే ఇక్కడ కాపు కాచాను నీ కోసమే ఇక్కడ ఇంత నాటకమాడవలసివచ్చింది. ఆరోజు ఇక్కడ గేట్‌కీపర్ శవంనోట్లో నువ్వు ఉంచిన డైరీ కాగితాన్ని నేను తిప్పి చూస్తే, 'నాకు పొగాకు పీల్చే అలవాటు లేదు. నాకెందుకు కేన్సర్ వచ్చిందని డాక్టర్ శివరాంగారిని అడిగితే సరియైన సమాధానం చెప్పలేక పోయారు,' అని నువ్వు ఎప్పుడో రాసి ఉంచావు. వెంటనే ఆ డాక్టరునుకలిస్తే, 'ప్రస్తుతం నా దగ్గర ఎనమండుగురు కేన్సర్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. వారిలో ఇతనెవరో తెలీదు,' అంటూ ఏడుగురి అడ్రస్‌లుమాత్రం ఇచ్చాడు. ఆ డైరీ కాగితం ముక్కలోని దస్తూరీతో వారి దస్తూరీలను పోల్చి చూస్తే, వారెవ్వరూ కాదని నిర్ధారణ అయింది. ఎనిమిదోవ్యక్తి అడ్రస్ తనవద్ద లేదని, అతని కేస్ ఫైల్‌ను అతనికే అప్పగించేశానని ఆ డాక్టర్ అంటూ, నీగురించి వివరాలు చెప్పాడు. నువ్వు మళ్ళీ తనదగ్గరికి రావొచ్చని కూడా చెప్పాడు. కాని, అంతవరకు ఊరుకుంటే ఎలా? ఈలోగా మరికొన్ని హత్యలు జరిగిపోవచ్చు నాకింకో అనుమానంకూడా కలుగక పోలేదు. పోలీసు శాఖను తికమకలు పెట్టడానికని ఒక ఆరోగ్యవంతుడే ఎవరో ఒక కేన్సర్ పేషెంట్ డైరీని కాజేసి, అందులోని కాగితాలమీద రాసిపడేస్తున్నాడేమో.. అని. కాని...ఒకటిమాత్రం రూఢిగా తేలిపోయింది. కఠినంగాప్రవర్తించేవారే ఒక్కొక్కరుగా హతమార్చబడుతున్నారు. నువ్వు ఆ నాడు చంపిన ఈ సర్కస్ గేట్‌కీపర్ కూడా కాస్త దురుసుగా ప్రవర్తించే స్వభావంగలవాడట. ఆరోజు అందరికన్నా చివరన మూడు రూపాయల టిక్కెట్ కొన్న వ్యక్తే ఆ గేట్‌కీపర్‌ను చంపి ఉండాలని ఇక్కడ నాకు తెలిసింది అందుకే ఆ ఆఖరు టిక్కెట్టు నెంబర్‌కే ఫస్ట్ ప్రైజ్ వచ్చినట్లు ఈ సర్కస్‌వారిచేత దినపత్రికల్లో ప్రకటనలు వేయించి, ఇంత నాటకమాడవలసివచ్చింది." అని ఆ వ్యక్తి అంటూండగా అంతవరకు

అక్కడ ప్రహతప్పినట్లు పడున్న ఆ కానిస్టేబుల్ నిద్రనించి మేల్కొన్న వాడిలాచివాలున లేచి నిలుచున్నాడు.

నా కంతా అయోమయంగా ఉంది. "మీరు...మీరు..."

"చాణక్య అంటారు నన్ను, డిటెక్టివ్‌ని."

"ఓ ! మీరా ?"

"నా పేరు విన్నావన్నమాట ?"

"ఆహా...ఏం తేజస్సండీ! పట్టుబడితే మీలాంటివారికే పట్టుబడాలి...నేను మరణించేలోగా తోటిమానవులను బాధ పెట్టేవారిని ఈ లోకంనించితప్పించడం నా ఆశయంగా భావించాను. మీ కిలా పట్టుబడకుండా ఉంటే – మరికొందరు దుర్మార్గులను నాకన్నా ముందే ఈ లోకంనించి తొలగించేవాడ్ని."

"అది తప్పించడానికే నే చేసిన ప్రయత్నం ఫలించింది. త్వరలో నువ్వు చావబోతున్నావని చట్టంతో చెలగాట మాడవచ్చా?"

ఆయన వంకే రెప్ప లార్పకుండా చూస్తూ, "సార్ ! కొంపతీసి మీకు కేన్సర్ లేదుకదా ?" అని అడక్కుండా ఉండలేకపోయాను.

"ఏదీ–నే నిప్పుడు దగ్గడం లేదే!"

"వద్దు, సార్ ! మీలాంటివారికి అలాంటి ఖర్మవ్యాధులు రాకూడదు," అంటూండగా చాణక్య తన చేతనున్న నా పిస్టల్‌ను పక్కనున్న కానిస్టేబుల్‌కు అందించి తన కోట్ జేబులోంచి పైప్‌నుతీసి వెలిగించబోయారు.

"సార్ ! ఆ అలవాటుమాత్రం క్రమక్రమంగా మా నేయడానికి ప్రయత్నించండి," అన్నాను. చాణక్య నవ్వారు.

ఇంతలో అక్కడ మూగిఉన్న గుంపును తోసుకొని, కొందరు కానిస్టేబుల్సు నా దగ్గరికి వచ్చారు. నా చేతులకు బేడీలు పడుతూండగా ఒక కారు వచ్చి ఆగింది. అందులోంచి దిగుతున్న డాక్టర్ శివరాంను చాణక్య చూడగానే, "థాంక్యూ ! ఇతన్ని గుర్తుపట్టడానికే మిమ్మల్ని రమ్మన్నాను," అన్నారు.

"ఇతనేనా !" అంటూ శివరాం నా వంక తెల్లబోయిచూస్తూండిపోయారు.

"డాక్టర్‌గారూ ! మీరు రాస్తున్న గ్రంథంలో నాది మంచి ఇంటరెస్టింగ్ మేటర్ అవుతుంది," అని నేనంటున్నప్పుడు నా కళ్ళల్లో ఉద్భవించినవి దుఃఖాశ్రువులో ఆనందబాష్పాలో నాకే తెలీదు.

నాకు తెలిసిందల్లా ఒక్కటే–నాకు అంతిమ ఘడియలు సమీపించాయి. ఎందుకంటే–ఈ మారు నా గొంతు మరీ బిగదీసుకుపోయింది.

